## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి సామగ్రి అందజేత



సామగ్రిని అందజేస్తున్న దాత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం కర్కస్ తండాలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ గుడికి.. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, గురువారం ఆలయ కమిటీ సభ్యులకు నిర్మాణ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దేవేందర్, శంకర్, రాజు, హనుమంతు, నర్య తదితరులు ఉన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కడ్తాల్: ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్, రాష్ట్ర పీఆర్ఓ శేఖర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారిగా వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా ధనుంజయ, నదీమ్‌లను నియమించారు. అనంతరం నూతన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా సభ్యులు శ్రీశైలం, భీష్మాచారి, రబ్బాని, మహేశ్, శివ, తరుణ్, నవీన్, కృష్ణ, సాయికుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన విద్య అందించేందుకు కృషి




కొత్తపల్లి పాఠశాల ఉపాధ్యాయులతో సంఘం నేతలు

యాచారం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు సేవ్ టీచర్స్ యూనియన్ కృషి చేస్తుందని ఆ సంఘం నేతలు అన్నారు. గురువారం మండల పరిధి పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో.. మంతన్‌గౌరెల్లి, మాల్, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడలో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### దత్తాత్రేయను కలిసిన బీసీ నేతలు



దత్తాత్రేయను సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను బీసీ సంఘం నాయకులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఇందులో ప్రముఖ సంఘ సేవకుడు బజారు భిక్షపతి, సంఘం నాయకులు శ్రీనివాస్, నర్సింహ తదితరులు ఉన్నారు.

### పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీశైలం



బాధ్యతలు స్వీకరించిన శ్రీశైలం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా జమ్మ శ్రీశైలం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# మృత్యుపాశాలు..

రక్షణలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచిఉంది. జనవాసాలు, రోడ్ల పక్కన ఉన్న కంచెలేని వాటితో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు.

- కలవర పెడుతున్న కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పొంచిఉన్న ముప్పు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: చుట్టూ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముందుచూపు లేకుండా ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. ప్రస్తుతం వానలు పడుతున్నాయని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని వాపోతున్నారు.

**నివాసాల మధ్య..**

ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం, రాయపోల్, ఉప్పరిగూడ, పోల్కంపల్లి, నాగన్‌పల్లి, ముకునూర్, చర్లపటేల్‌గూడలతో పాటు పట్నం మున్సిపాలిటీల్లో చాలా చోట్ల రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. ఎంబీఆర్‌నగర్, ఉప్పరిగూడ బస్టాండ్, వెంకటరమణ కాలనీ, ఖానాపూర్, సీతారాంపేట్‌లో రోడ్లకు ప్రక్కనే ఏర్పాటు చేశారు. దీని పక్కనుంచే మూగజీవాలు, ప్రజలు నడుచుకుంటూ వెళ్తుంటారని, దీని వలన ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని స్థానికులు తెలిపారు. గతంలో పోల్కంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డారని చెప్పారు. కొంగరకలాన్‌లో ఓ లైన్‌మెన్ మృతి చెందిన సంఘటన కూడా ఉంది. కంచెలేని వాటికి రక్షణ వలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంబీఆర్ నగర్ నివాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్



శేరిగూడలో..

### ఏదైనా ప్రమాదం..



ఎంబీఆర్‌నగర్‌లో మా దుకాణం ఎదుట పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దానికి రక్షణగా ఎలాంటి వలయం లేదు. దీని పక్కనుంచే చిన్నారులు పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరగకముందే రక్షణ చర్యలు చేపట్టాలి.

– లింగస్వామి, ఇబ్రహీంపట్నం

### నిర్లక్ష్యం వీడాలి



మున్సిపాలిటీ పరిధిలో చాలా చోట్ల కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు అనేకంగా ఉన్నాయి. అవీ ఇళ్లమధ్య, రోడ్లపక్కనే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం వానలు విస్తృతంగా పడుతున్నాయి. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి, కంచెలు ఏర్పాటు చేయాలి.

– జెర్కొని రాజు, ఇబ్రహీంపట్నం

### చర్యలు తీసుకుంటాం

మున్సిపాలిటీ పరిధిలో కంచెలు లేని 14 ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాము. ఎవరూ ఆందోళన చెందవద్దు. తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తున్నాము. ఇదే అంశమై పై అధికారులకు నివేదిక పంపించాము. అనుమతులు రాగానే రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తాం.

– అఖిలేష్, ఏఈ, ఇబ్రహీంపట్నం



సమావేశంలో మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

# కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కంభాలపల్లి గురునాథ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మహేంద్ర(మేదరి)సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఇందూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుల గురువు సీతయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. వెదురు కర్రలను ఉపయోగించి తయారు చేసే పరికరాలు మనిషి పుట్టినప్పటి నుంచి కాటికి వెళ్లే వరకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడటం వలన మేదర వృత్తి, పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో మానవ జీవన ప్రమాణం 100 సంవత్సరాల నుంచి 60కి తగ్గిందన్నారు. ప్లాస్టిక్ నివారణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, ఓబీసీ చైర్మన్ సుబ్బారి పాండు, మల్లిక, పద్మ, చెన్నయ్య, యాదగిరి, మహావీర్ తదితరులు పాల్గొన్నారు.

# ముందు జాగ్రత్తే మేలు



వరి పంటను పరిశీలిస్తున్న డాక్టర్ స్వర్ణలత దేవి తదితరులు

మంచాల: వరి పంటకు తెగులు సోకకుండా రైతులు తగిన జాగ్రతలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణలత దేవి అన్నారు. గురువారం మండల పరిధి మంచాల, లింగంపల్లిలో వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి గ్రామాల్లో (కె.ఎస్.ఎం.1638) వరి విత్తనాలను పంపిణీ చేశామని, ప్రస్తుతం ఆ పంట చేలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నామని వివరించారు. ఆ పంటలకు చీడపీడ, తెగులు సోకే ప్రమాదం ఉందని, ముందు జాగ్రత్తలు తీసుకోవడమే మేలన్నారు. రైతులు పండించిన పంట నుంచే విత్తనాలను తిరిగి తీసుకోవాలని సూచించారు. తెగులు నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంచాల వ్యవసాయ అధికారి శ్రీలత, ఏఈఓ లింగస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్




సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

- సాయుధ పోరు నడిపింది ఎర్రజెండానే
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్

ఇబ్రహీంపట్నం రూరల్: వీరతెలంగాణ విరోచిత పోరాటానికి నాయకత్వం వహించింది ఎర్రజెండానేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ అన్నారు. చరిత్రను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను మండల పరిధి పోల్కంపల్లిలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పోరాట యోధుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలను చైతన్య పరిచి.. దోపిడీ దారులైన దొరలు, జాగీర్దార్లు, పటేల్, పట్వారీలు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిపిన పోరాట ఘట్టమే.. సాయుధ రైతాంగ పోరాటమన్నారు. ఆ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని, వాటితో సంబంధం లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్.. చరిత్రను వక్రీకరిస్తున్నాయని పేర్కొన్నారు. విమోచనం పేరుతో బీజేపీ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఆ ఉద్యమంలో అన్ని మతాల వారు ఉన్నారని, మతసామరస్య వారసత్వాన్ని ఇప్పుడు బీజేపీ తమ మతోన్మాద రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, నాటి నిజాం పాలనకు ఎలాంటి తేడా లేదన్నారు. నిజాం ప్రభువు.. తెలుగును అణచివేసి పర్షియన్, ఉర్దును ప్రజలపై రుద్దే ప్రయత్నం చేశారని, ఇప్పుడు బీజేపీ హిందీ, సంస్కృతం భాషలను రుద్దే యత్నం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుగ్గ రాములు, జిల్లా కమిటీ సభ్యుడు జగన్, మండల కమిటీ సభ్యులు చెరుకూరి నర్సింహ, అమనగంటి నర్సింహ, నాయకులు యాదయ్య, కరుణాకర్ రెడ్డి, స్వామి, అశోక్, ఇస్తారి, బాలయ్య, దనంజీ, మహేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల నెరవేర్చిందని అధికార పార్టీ నాయకులు అన్నారు. ఎంపీడీఓ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు గాజుల శ్రీనులు గురువారం పరిశీలించారు. లబ్ధిదారులు ఇదే నమూనాలో ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు.

### వీడని యూరియా కష్టాలు

మాడ్గుల: రైతులను యూరియా కష్టాలు వీడటం లేదు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు 450 బస్తాల యూరియా వచ్చింది. ఎరువు వచ్చిందన్న సమాచారంతో అన్నదాతలు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో అందరికీ అందకపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ.. నిరాశతో వెనుదిరిగారు.

### హైటెన్షన్ లైన్ మార్చండి

కడ్తాల్: పంట పొలాల మీదుగా తీస్తున్న బీదర్– మహేశ్వరం 765 కేవీ హైటెన్షన్ లైన్ మార్చాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ.. బాధిత రైతులు చేపట్టిన దీక్ష గురువారానికి 11వ రోజుకు చేరుకుంది. దీక్షకు తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సంఘీభావం తెలిపారు.

### ట్రాఫిక్ సీఐగా జితేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ట్రాఫిక్ సీఐగా జితేందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన నర్సింహారెడ్డి సైబర్ క్రైంకు వెళ్లారు. జితేందర్‌రెడ్డి.. పహాడీషరీఫ్ డీఐగా పని చేశారు. బాధ్యతలు స్వీకరించనున్నారు.

# పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకుల డిమాండ్
- సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: ఉపాధి కూలీలు, గ్రామ పంచాయతీ కార్మికులకు అందాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో ధర్నా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ మండల నాయకుడు రాయికంటి శేఖర్ కార్మికులతో కలిసి ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి జగన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ మాట్లాడారు. నెలల తరబడి కార్మికులకు వేతనాలు అందించకుండా వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రతి ఏడాది రెండు జతల దుస్తులు, గ్లౌజులు, మాస్కులు, ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క ఉపాధి హామీలో పని చేసే కూలీలకు నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్ ఉన్నాయన్నారు. ఉపాధి హామీని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికే ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వెంటనే పెండింగ్ వేతనాలు అందించాలని, పని సామగ్రి ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు అంకగళ్ల కుమార్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మాదారం నర్సింహా, ఉపాధి కూలీలు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బీజేపీ క్వార్టర్స్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కమలనాథులు

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్

మీర్‌పేట: ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్‌ముదిరాజ్ సూచించారు. పార్టీ పిలుపుమేరకు సేవాపక్షం మండల మున్సిపల్‌స్థాయి కార్యక్రమంలో భాగంగా గురువారం మీర్‌పేట బీజేపీ క్వార్టర్స్‌లో చేపట్టిన స్వచ్ఛభారత్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన వీధుల్లోని చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రధాని జన్మదినం సందర్భంగా పార్టీ పిలుపు మేరకు స్వచ్ఛభారత్ చేపట్టామని వెల్లడించారు. పార్టీ మీర్‌పేట–2 అధ్యక్షుడు ముఖేశ్‌ముదిరాజ్, నాయకులు సోమేశ్వర్, గాజుల మధు, హైందవిరెడ్డి, కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ నిర్వాహకులు, ప్రిన్సిపాల్, సిబ్బంది

కందుకూరు: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంను మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అందులో భాగంగా ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల తోట, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్, కిచెన్ గార్డెన్, మొక్కల పెంపకం వంటి వాటిని సీజీఆర్ సంస్థ సభ్యుడు, వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకుడు మాధవ రెడ్డి ప్రారంభించారు. రావిచెట్టు, వేపచెట్టు కలిసి ఉన్న చెట్టును తల్లి చెట్టుగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజీఆర్ సంస్థ ఏర్పాటు చేసిన ఔషధ వనంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెంటార్లు గురు రాజారెడ్డి, పుష్పలత, ఎర్త్ లీడర్లు మాధవి, హాసిని, తేజస్విని, మధిహ, హనీప్రియ, తరుణ్, అర్చన, కో–ఆర్డినేటర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

# మాజీ ఎంపీకి పరామర్శ

ఆమనగల్లు: అస్వస్థతకు గురై కోలుకున్న పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌ను పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్. నగరంలోని ఆయన నివాసంలో గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

**పీసీసీ అధికార ప్రతినిధికి..**

పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ తండ్రి రతన్ సింగ్ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు గురువారం కల్వకుర్తిలోని ఆయన నివాసంలో మృతుడి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీని పరామర్శించారు. పరామర్శించిన వారిలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రమేశ్‌గౌడ్, అన్నెబోయినపల్లి మాజీ సర్పంచ్ రాంరెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్, సభ్యులు లక్ష్మణ్‌రాజు, జంగయ్య, మల్లేశ్ యాదవ్, నాగరాజు, నజీర్ తదితరులు ఉన్నారు.



మధుయాష్కిని పరామర్శిస్తున్న శ్రీనివాస్‌గౌడ్



రతన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం



సరూర్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

### రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమస్యల తిష్ట

- కూర్చునేందుకు కుర్చీలు.. తాగేందుకు నీరు నిల్
- కనీస అవసరాలకు కరువే
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు



భూ క్రయవిక్రయదారులతో రద్దీగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. దీంతో రోజంతా ఆఫీసులో పని చేస్తున్న ఉద్యోగులే కాదు, స్థిరాస్తి వ్యాపారులు, భూముల క్రయవిక్రయదారులు, డాక్యుమెంట్ రైటర్లు ఇలా నిత్యం ఇక్కడికి వచ్చే వారంతా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

**రోజుకు 40పైనే..**

సరూర్‌నగర్ ఎంపీడీఓ ఆఫీసు సమావేశం హాలులో.. ప్రభుత్వం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ రోజుకు కనీసం 40 నుంచి 50 రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. ఒక్కో డాక్యుమెంట్ కోసం సగటున ఐదు నుంచి ఆరుగురు ఇరు పక్షాల నుంచి వస్తుంటారు. ఇలా నిత్యం సుమారు ఐదారు వందల మంది వచ్చిపోతుంటారు. రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, ఇతర ఫీజుల రూపంలో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తోంది.

**అన్నింటికీ ఉగ్గపట్టాల్సిందే..**

సర్కారుకు భారీగా ఆదాయం తెచ్చిపెడుతున్న కార్యాలయంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వలన మౌలిక సదుపాయాలు మృగమయ్యాయి. కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేవు. తాగేందుకు నీరు లేదు. ఇక మలమూత్ర విసర్జన కోసం సుదూర ప్రాంతాల్లోని.. మరుగుదొడ్లు, లేదా పక్కనే ఉన్న వికలాంగుల శాఖ జిల్లా కార్యాలయంలోకి పరుగు తీయాల్సి వస్తోంది. మహిళల ఇబ్బందులు చెప్పలేనివి.

### పార్కింగ్ లేదు



రిజిస్ట్రేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వాహనాల రాకపోకలతో ఆ ప్రాంతమంతా రద్దీగా ఉంటోంది. కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణంలో పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో ప్రధాన రహదారిపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీని వలన నిత్యం ట్రాఫిక్ కష్టాలతో పాటు.. ప్రమాదాలు జరుగుతున్నాయి.

– జహీర్, వార్డు కమిటీ సభ్యుడు